జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికి ఆరోగ్యం



సీకేదిన్నె : వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎర్రగుంట్ల : చిలంకూరులో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం అందుతోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఇప్పపెంట-2 సచివాలయ పరిధిలోని జె.కొత్తపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటింటికి వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం స్థానిక వైద్యులను ప్రశంసించారు. రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.దీప్తి, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌లను అభినందించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహారం వస్తువులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, తాహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, ఎంపీడీఓ రహమత్తులయ్య, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండలంలోని చాగలేరు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు పర్యవేక్షించి రోగులకు మందులను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం చాగలేరులో 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అర్జునరావు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, వైద్యులు గోపీనాథ్, సాఫియా, సుమ, శరణ్య, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, సర్పంచులు చెన్నారెడ్డి, అర్జున్ గ్రామస్తులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని కొప్పోలు ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 257 మందికి వైద్య సేవలను అందించారు. వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 55 మందికి వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. 61 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. 11 మందిని ఉన్నత స్థాయి వైద్య సేవలకై రెఫర్ చేశారు. అనంతరం మందులను, ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొ న్నారు.

వీఎస్‌పల్లెలో..



వేముల : మందులను పంపిణీ చేస్తున్న మండల ఇన్‌చార్జి, ఎంపీపీ, తదితరులు



వల్లూరు : కొప్పోలులో వైద్య సేవలందిస్తున్న వైద్య నిపుణులు



చెన్నూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సిబ్బంది

వీరపునాయునిపల్లె : గంగిరెడ్డిపల్లె సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి పరిశీలించిన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మండల వైద్యాధికారులు మహమ్మద్ తాహ, జ్యోతి, మాజీ ఎంపీటీసీ రవి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని ఇసుకపల్లెలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మునెయ్య, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి వారికి మందులను అందించారు. ప్రజలు కూడా మంచి చేసేవారిని గుర్తించి వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిత, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని వేపరాలలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పరిశీలించిన ప్రజలను వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ తిరుపతయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : సంకేపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డిఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపమండల అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యులు 505 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

తొండూరులో..

తొండూరు : మండలంలోని ఇనగలూరులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, సర్పంచ్ గంగయ్యలు పరిశీలించి ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి సన్నన్న, తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీడీఓ ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె వైఎస్సార్ సీపీ క్లినిక్‌లో సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 300 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 45 మందికి వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సీహెచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి బి.చెన్నారెడ్డి, తహసీల్దార్ పఠాన్‌అలీఖాన్, ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్(చిన్న), సచివాలయ సిబ్బంది వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి నూతన భవనంలో వైద్య సేవలు

కమలాపురం : నగర పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న సీహెచ్‌సీ నూతన భవనంలోనే శుక్రవారం నుంచి వైద్య సేవలు అందిస్తామని సీహెచ్‌సీ జనరల్ సర్జన్ డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రసుతం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కనున్న గ్రంథాలయ భవనంలో సీహెచ్‌సీ కొనసాగుతుందన్నారు. ఇటీవల సీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం కావడంతో వైద్య సేవలు అక్కడి నుంచి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. రోగులు, పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సీహెచ్‌సీ నూతన భవనంలో అందించే వైద్య సేవలు వినియోగించు కోవాలని ఆయన తెలిపారు.

జూదరుల అరెస్టు

సింహాద్రిపురం : మండలంలోని జంగంరెడ్డిపల్లెలో గురువారం సత్రం వెనుకవైపు ఉన్న ముళ్ల పొదలలో జూదం ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారివద్దనుంచి రూ.15,300లు నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే 9121100613 నెంబకు సమాచారం అందించాలన్నారు.

సబ్సిడీ శనగల పంపిణీ

సింహాద్రిపురం : మండలంలో రబీలో సాగు చేయడానికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ శనగలను కసునూరు ఆర్‌బీకేలో స్టేట్ హార్టికల్చర్ మెంబర్ శివప్రసాద్‌రెడ్డి గురువారం రైతులకు అందజేశారు. ప్రభుత్వం 40 శాతం రాయితీతో ఈ శనగలను అందజేస్తున్నారని, మార్కెట్లో క్వింటా ధర రూ.8100లు కాగా రూ.3240 సబ్సిడీ పోగా రైతు వాటా రూ.4860లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 5195 క్వింటాల శనగలు మంజూరయ్యాయన్నారు. కావాల్సిన రైతులు ఆయా గ్రామసచివాలయ ఆర్‌బీకేల వద్ద ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి రిజిస్టర్ చేసుకోవాలని రైతులకు సూచించారు.

నగదు బహుమతి అందజేత

పెద్దముడియం : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు కనబరచిన విద్యార్థులకు గ్రామానికి చెందిన బైరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్టు తరపున నగదు బహుమతి అందజేసినట్లు ట్రస్టు నిర్వాహకుడు బైరెడ్డి లక్ష్మిరెడ్డి తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన వాసవికి రూ.15000, రెండవ స్థానం సాధించిన సాయిదీప్తికి రూ.10000, మూడవ స్థానం సాధించిన నేహకు రూ.5000 నగదు అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

వల్లూరు : బీటెక్ చదువుతున్న వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని హేమలతకు తేజశ్విని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయాన్ని అందించారు. మండలంలోని కుముద్ బెన్ జోషి నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆమెకు ట్రస్ట్ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి స్నేహితులతో కలిసి ఆమెకు హాస్టల్ సౌకర్యానికి గానూ రూ.15 వేలు అందించారు. ఆమె బీటెక్ పూర్తి చేసే వరకు తమ సంస్థ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు.

ఉపాధి హామీ ఏపీఓగా గంగయ్య

కమలాపురం : మండల ఏపీఓగా గంగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. డ్వామా పీడీ ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా రాజుపాళెం మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న గంగయ్య కమలాపురంకు బదిలీ పై వచ్చారు. అలాగే ఇక్కడ ఏపీఓగా పని చేస్తున్న నరసింహులు సిద్ధవటంకు బదిలీపై వెళ్లారు.

కడపకు వెళ్లి పింఛన్ పంపిణీ



రామకృష్ణయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పి.రమాదేవి

జమ్మలమడుగు : సిరిగేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని శిరిగేపల్లి వాసి అయిన జింకా రామకృష్ణయ్య అనారోగ్యంతో కడపలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ రమాదేవి అక్కడికి వెళ్లి అతనికి ఫించను అందించారు. సూచించారు.

ఈ స్టాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : స్థానిక డీసీసీ బ్యాంక్‌లో అందుబాటులో ఉన్న ఈ స్టాంప్‌లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక డీసీసీ బ్యాంక్‌లో ఈ-స్టాంప్‌లను విడుదల చేశారు. భూములు, స్థలాలు, ఇళ్లు తదితర క్రయ విక్రయాలు జరుపుకునే వారికి డీసీసీ బ్యాంక్‌లో ఈ-స్టాంప్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించి స్టాంపులు పొందవచ్చని, ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సుధీర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం



రైతులతో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ అధికారులు

లింగాల : మండలంలోని పార్నపల్లి, తాతిరెడ్డిపల్లె, వెలిదండ్ల, కర్నపాపయ్యపల్లె, లింగాల గ్రామాలకు చెందిన రైతులు వారి సమస్యలను కడప ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తేవడంతో ఆయన సూచనలమేరకు గురువారం లింగాల కుడికాలువపై నీటిపారుదల శాఖ అధికారులు పర్యటించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత వారంలో కురిసిన వర్షాల వల్ల కర్నపాపయ్యపల్లె గ్రామం వద్ద కాలువ పొంగిపొర్లి ప్రవహించి రైతుల పొలాల్లో తీవ్రంగా పంట నష్టం జరిగింది అలాగే లింగాల కుడికాలువ వద్ద వరదనీరు ప్రవహించి పంట దెబ్బతిన్న పొలాలను నీటిపారుదలశాఖ అధికారులు పరిశీలించారు. ఎస్ఈ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తాతిరెడ్డిపల్లె చెరువుకు నీరు వెళ్లే కాలువ మూడు చోట్ల లీకేజ్ అవుతోందని, ఈ కాలువపై నాలుగు కల్వర్టులు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా 250 మీటర్ల పైపులైను ఏర్పాటు చేయాలని ఇందుకు అంచనాలు వేస్తున్నామన్నారు. కర్నపాపయ్యపల్లె గ్రామ సమీపంలో కాలువ గట్లు ఎత్తు చేస్తామన్నారు. లింగాల-బోనాల ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టును పెద్ద బ్రిడ్జిగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పార్నపల్లి గ్రామ సమీపంలో నీరు లీక్ అవుతున్న బావివద్ద నుంచి చిత్రావతి నది వరకు ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి పొలాల్లోకి నీరు సీపేజ్ కాకుండా చూస్తామన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఈలు వాసుదేవ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జనం మెచ్చిన సీఎం వైఎస్ జగన్



జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : జనం మెచ్చిన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం స్థానిక నగరిగుట్ట సచివాలయ పరిధిలోని చిన్నన్న రూములు, నగరిగుట్ట, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. అలాగే ఇళ్లు, పింఛన్లు రాని వారిని గుర్తించి వారికి అవి అందేలా చేయాలని అధికారులను ఆదేశించారు. పథకాలు అందని ఇళ్లు అంటూ ఉండకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, కమిషనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, విద్యార్థి విభాగం నాయకులు జశ్వంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కసిరెడ్డి

పులివెందుల టౌన్ : వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కసిరెడ్డి తెలిపారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా పులివెందుల ఫారెస్టు అధికారులు గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల రమణప్ప సత్రం పాఠశాల, వెంకటప్ప పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. వన్యప్రాణులను రక్షించి ప్రకృతిని కాపాడుకుందామని విద్యార్థులకు సూచించారు. ఎఫ్‌బీఓలు,, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించండి

వేముల : గ్రామాల్లో పౌష్టికాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించాలని మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు సూచించారు. గురువారం మండలంలోని చాగలేరులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను వారు పరిశీలించి మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, ఆకుకూరలు, కాయగూరలు, కోడిగుడ్లు వంటి విటమిన్ కలిగిన పౌష్టికాహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి అర్జునరావు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వద్దిరాలపై విమానం చక్కర్లు



వద్దిరాల గగన తలంపై చక్కర్లు కొడుతున్న విమానం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : సర్వే నిమిత్తం వచ్చిన ఓ విమానం వద్దిరాల పరిసరాల చుట్టూ రెండు గంటల పాటు చక్కర్లు కొట్టింది. గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మైలవరం కొండాపురం మండలాల్లోని పలు గ్రామాలపై అనేక సార్లు చక్కర్లు కొట్టింది. మైలవరం మండలంలోని వద్దిరాల, చిన్న వెంతుర్ల, బెస్తవేముల, దొడియం, నక్కోనిపల్లె, రామచంద్రాయపల్లె, అలాగే కొండాపురం మండలంలోని తిరుమాలయపల్లె, దొబ్బుడుపల్లె, టి.కొడూరు, ఎస్ కొత్తపల్లె తదితర గ్రామాలపై చక్కర్లు కొట్టింది. మైలవరం-కొండాపురం మండలాల మధ్య కొని వేల ఏకరాల కొండ ప్రాంతం ఉంది. ఈ కొండల్లోని భూగర్భంలో విలువైన ఖనిజాలు ఉన్నట్లు సమాచారం. ఖనిజ నిల్వల నిర్ధారణకో లేక మరి ఏదైన పరిశ్రమ స్థాపనకో సర్వే నిమిత్తం ఈ విమానం చక్కర్లు కొట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గతనెల 30వ తేదీన శనివారం కూడా ఉదయం ఇదే ప్రాంతంలో ఇలాంటి విమానమే అరగంట పాటు చక్కర్లు కొట్టి వెళ్లింది. తిరగి 5 రోజుల తరువాత గురువారం రెండు గంటలకు పైగా విమానం చక్కర్లు కొట్టింది.

నేత్రదానం

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంకు చెందిన బండి శ్రీరామిరెడ్డి బుధవారం మరణించడంతో ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మృతుని ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఎవరైనా మరణించినట‌లైతే 9966509364, 7093204537కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు మంజుల

పులివెందుల రూరల్ : పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి కల్యాణ మండపంలో గురువారం నూతన అంగన్‌వాడీ కమిటీని ఎన్నుకున్నారు. పులివెందుల ప్రాజెక్టు సమావేశంలో నూతనంగా 15 మంది సభ్యులు చేరారని అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు మంజుల అన్నారు. అధ్యక్షురాలు విజయభారతి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమారి, కోశాధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలు లక్ష్మిదేవి, సహాయ కార్యదర్శిగా పరిమల ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రభావతి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ



దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

పులివెందుల రూరల్ : మండలంలోని పురుగుమందుల దుకాణాలను గురువారం సంబంధిత అధికారులు ఐదు టీములుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. అమ్మకాలు ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో ఎక్కడ నకిలీ మందులు లేవని గుర్తించారు. ఈ తనిఖీల్లో ఏడీఏలు అశోక్‌రెడ్డి, మాధవి, అనిత, వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి, ఏవోలు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లెలో శుక్రవారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కొత్తపల్లె సచివాలయ పరిధిలోని నాలుగు గ్రామాలకు సంబంధించి కొత్తపల్లె పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను ఆయన గురువారం వైద్య బృందంతో కలిసి పరిశీలించారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పెండ్లిమర్రిలో జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజలకు చేసిన మంచి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. గతం ప్రభుత్వంలో ఏమేరకు అభివృద్ధి జరిగింది. ఈ ప్రభుత్వంలో ఏమేరకు అభివృద్ధి జరిగిందో ప్రజలకు వివరించాలన్నారు. మండల నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఈనెల 11వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందించిన పథకాల గురించి చెప్పాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

లింగాల : బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని లింగాల మహిళా పోలీసులు అన్నారు. గురువారం చిన్నకుడాల సమీపంలోని బాలయోగి ప్రతిభా గురుకుల పాఠశాలలోని బాలికలకు బాల్యవివాహాలపై వారు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. 2006 చట్టప్రకారం బాల్యవివాహాలు నేరమన్నారు. బాలికలకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ, మహిళా పోలీసులు కవిత, దస్తగిరమ్మ, వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : బాల్య వివాహాల నివారణపై మహిళలందరు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ రహమత్తులయ్య తెలిపారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు ఏపీఎం జగదీశ్వరి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సీసీ, గ్రామ సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలను కల్పించండి



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మాడిశెట్టి శివ

ఎర్రగుంట్ల : స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని స్థానిక వాసులకు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే విధంగా నిర్మించాలని కోరుతూ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మాడిశెట్టి శివ కోరారు. గురువారం రైల్వే డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌ను ఆయన కలసి ఎంపీ వైస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిలు ఇచ్చిన వినతిపత్రాలను డీఆర్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు, అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించాలని ఎంపి, ఎమ్మెల్యేలను కలిసి విన్నవించగా వారు దీనిపై స్పందించి వెంటనే రైల్వే శాఖ ఉన్నతాధికారులకు వారు ఇచ్చిన వినతిపత్రాన్ని అందజేయాలన్నారు. వారి ఆదేశాల మేరకు ఇటీవల సికింద్రాబాద్‌లో కూడా అందజేశామన్నారు. ఇప్పుడు రైల్వే డీఆర్ఎంకు అందించామన్నారు. డీఆర్ఎం స్పందించి దీనిపై పూర్తి నివేదికను తయారి చేయాలని సంబంధిత అధికారికి ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ మాజీ మెంబర్ నాగరాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

వేంపల్లె : ఉషాకిరణ్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగేశ్వరరావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించినట్లు కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి తెలిపారు. ఈ అవార్డు దక్కింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక వికాస్ పాఠశాల ఉపాధ్యాయురాలు రఫియా గురువారం కడపలోని జడ్పీ సభాభవనంలో ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు నజీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహమ్మద్ ఇక్బాల్ బాషాకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందినట్లు ప్రిన్సిపల్ ముబీనా తెలిపారు. ఈమె కూడా ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కరస్పాండెంట్ డా.ఎస్.ఎఫ్.బాషా, డైరెక్టర్ అన్వరుల్‌హక్, ఉపాధ్యాయులు అభినందనలు హర్షం వ్యక్తం చేశారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక అన్ని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారికి పారిశుద్ధ్యంపై వ్రాతపరీక్ష నిర్వహించి అందులో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.